ఉప్పులేని కూడు

దీపావళి కథల పోటీలో రు.600 బహుమతి పొందిన కథ

శృంగవరం లింగన్నగారి పంపుసెట్టు దగ్గిర, సిగ్గెరగని ఆడతనం సబ్బు అరగదీసుకుంటోంది. లింగన్నగారి జీతగాడు వెంకటేశుకు ఇష్టంవున్నా లేకపోయినా, ఆ నిత్యకృత్యం మాత్రం ఆగిపోయేదికాదు.

బారెడు పొద్దెక్కినా యింకా నిద్రమైకం వదలని ముఖాలతో నలుగురు ఆడవాళ్ళు పంపునీళ్ళకు అడ్డంపడ్డారు. రాక్షసిమూకకు జడిసి కకావికలై పోయే మునిగణంలా, పంపునీళ్ళు హోరుమంటోంది.

ఇరవైలోనే అరవైఏళ్ళ అనుభవాన్ని నెత్తికెత్తుకున్నందువల్లనేమో, వాళ్ళ సొంపులూ, మేని వొంపులూ ముతకబారిపోయి, సహజంగా కాక, సొమ్ములు పెట్టుకున్నట్లుగా కనిపిస్తున్నాయి.

వాళ్ళు కచ్చికతో పళ్లుతోముకుని, తడి చీరలు చుట్టుకుని స్నానాలు చేస్తూ, రాత్రి తమతో గడిపివెళ్ళిన విటుల విపరీత చేష్టల్ని గురించి – ఎంత నగ్నంగా చెప్పవచ్చునో అంత సూటిగానూ, స్పష్టంగానూ ఒకరి కొకరు చెప్పుకోసాగారు ఆ కబుర్లు వినటానికి ఆసక్తికరంగానే వున్నా, అక్కడ నిలబడటానికి సిగ్గు వేసింది వెంకటేశుకు. నీళ్లు ఎంతవరకూ సాగిందో చూచే నెపంతో, అతడు చెరకుతోటలోకి దారి తీశాడు.

చెరకు గుముల చాటు నుంచి వారకాంతల బూతు సల్లాపాలు శివాలెత్తిన గంగమ్మలా దూకుళ్ళతో వినిపిస్తూనే వున్నాయి. బావికి ఇరవై బారల దూరంలో ఎత్తుగావున్న తారు రోడ్డుకు యివతల చింతచెట్ల గుబురునీడల కింద పూరింటి వాకిట నిలబడి, మార్కెట్టుకు వెళ్తోన్న కూరగాయల గంపను దింపించి బేరమాడుతున్న సుందరమ్మ అతడి కళ్ళ బడింది. క్యారుమని ఖాండ్రించి, "సిగ్గులేనోడు, సిగ్గులేనోడు!" అంటూ

తుపుక్కున ఉమ్మేసాడు వెంకటేశు.

లింగన్నలాంటి పెద్దమనిషి యిలాంటి పని మ్యాతం చేసి వుండకూడదు !

వరసగా రెండుసార్లు పంచాయతీ సర్పంచ్‌గా వుండి కూడా ప్రజలకు ఏమీ చేయలేకపోయిన లింగన్న ముచ్చటగా మూడో సారి ఎన్నికైన తరవాతయినా తాగునీళ్ళులేని వాడల్లో బోరింగులు వేయించకపోతాడా, కటిక చీకటో మునిగిపోయిన వాడల్లో కరెంటు వెయ్యకపోతాడా అని ఆశలు పెంచుకున్నారు జనం. నీళ్ళా, నీటిదీపాలూ లాంటి చిన్న విషయాలెందుకని, ప్రజలకు పెద్ద సౌకర్యమే కలగజేసి పుణ్యం కట్టుకున్నాడు లింగన్న.

శ్రీరామచంద్రుల వారి పేరు పెట్టుకున్న ఒక తిరుగుబోతు, సుందరమ్మను లేవదీసు కొచ్చి శృంగవరంలో కాపురం పెట్టాడు. సుందరమ్మ కంటే మెరుగైన మరో బొమ్మను లేవదీసుకుని శృంగవరం నుంచీ మాయ మయ్యాడు.

'అన్నా, ఆడదాన్ని ! నాకు ఫలానా సాయం చెయ్యి' అని లింగన్నను శరణువేడింది, దిక్కులేని సుందరమ్మ.

ఊరి చివర రోడ్డు పక్కనే లింగన్న పొలాలున్నాయి. ఆ పొలాలకూ రోడ్డుకూ మధ్యనున్న ఖాళీస్థలం హైవేస్ వారికి చెందుతుంది. వారం తిరక్కుండానే లింగన్న వెయ్యిరూపాయలు ఖర్చుపెట్టి అక్కడొక ఐదంకణాల పూరిల్లు కట్టించాడు. సుందరమ్మ ఆ యింట్లో నాలుగు వెదురు తడికలు అడ్డంపెట్టి, వ్యాపారంలోకి దిగింది. ఆ రంగంలో ఆమెకు అంతో యింతో అనుభవమూ, నేర్పూ వున్నట్టున్నాయి. చీకటివేళలో ఏ క్షణంలో వెళ్లినా మగవాడి మదనతాపం తీర్చటానికి ఆ యింట్లో నలుగురు గుమ్మలు సిద్ధంగా వుంటారు. వారానికీ రెండు వారాలకూ పాతవాళ్ళు ఎగిరిపోయి, కొత్తవాళ్ళు దిగుతుంటారు.

సానికొంపలో దూరేటంత దమ్ములు శృంగవరంలో ఎవరికుంటాయి లెమ్మనుకున్నాడు వెంకటేశు, మొదట్లో. రాను రాను అతని అంచనా తల్లకిందులైపోయింది ఒకరికి తప్పుగా అనిపించేది మరొకరికి ఒప్పుగానూ వుంటుంది. పాప ఫలాన్ని భక్షించవద్దని దేవుడంతటివాడు శాసిస్తే, ఆదం అవ్వలు విన్నారు గనకనా ? తడికల చాటున కిరసనాయిలు బుడ్డిదీపాల గుడ్డి నీడల్లో సుందరమ్మ వ్యాపారం మూడు పువ్వులూ ఆరుకాయలుగా వర్థిల్లుతోంది. సినిమా థియేటర్ల వాళ్ళు కూడా ఇప్పుడు తమ పోస్టర్లను ఊరిచివర సుందరమ్మ యింటిగోడకు పోటీలు మీద అంటిచేస్తున్నారు. లింగన్నకు ఇంటద్దె వారానికి వందరూపాయలు పువ్వుల్లో పెట్టి యిచ్చుకుంటున్నది సుందరమ్మ.

చివరి కయ్యలోకి నీళ్ళు మళ్ళించి, మళ్లీ పంపు దగ్గరి కొచ్చాడు వెంకటేశు. ఆ నలుగురూ జలకాలు ముగించి, తడిచీరలు విడిచి పొడిచీరలు కట్టుకుని, ఉతికిన లంగాలూ, బాడీలూ ఎండలో ఆరవేసుకుంటున్నారు. ఊరిబయట నిర్మానుష్యంగా వున్న పైరు పచ్చల నడుమ సీతాకోకచిలుకలు రెక్కలల్లార్చుకుంటున్నట్టుగా వున్న ఆ దృశ్యం నయనానందకరంగానే వుంది.

సుందరమ్మ కొంపలో నుంచి కొత్తపిట్ట ఒకటి బద్ధకంగా నడిచొచ్చి కురులు విప్పుకుని, కోడెవయసులా దూకుతున్న నీళ్ళ కింద కూర్చునేసింది. వెంకటేశు కంటిమీద రెప్పపడలేదు. ఆ అమ్మాయికి పదహారేళ్ళుంటాయి. ఏ ఒక్కడికో స్వంతం కావాల్సిన ఆమె లేత ఒళ్ళు పదిమంది చేతుల్లోనూ నలిగినందువల్లనేమో, సిందెలోనే పండిపోయి నట్టుగా వుందామె యౌవనం.

"కొత్తపిల్లగా వుందే ! ఎప్పుడొచ్చింది?" అన్నాడు వెంకటేశు.

"రాత్రొచ్చింగిలె ఆ తిలోత్తమ ! ఏం ? నీకు గావాల్నా ?" అని రాగం తీసిందొక ఒయ్యారిభామ.

"నా కెందుకు ?"

"ఎందుకా ? ఏం, నువ్వు మొగోడివి కావా ?" అంది తిలోత్తమ. అందరూ కిలారున నవ్వారు.

"సిగ్గులేనోడు !" అని గొణుక్కుంటూ, తుపుక్కున వుమ్మేశాడు వెంకటేశు. "సిగ్గులేనోడు సొంతలాబం కోసరం బంగారమట్టాంటి వూరిని పాడుజేసినాడు. అసలీయనకు ఏం తక్కువయిందనీ ? ఆ సిస్తిలో అంతస్తులో ఈయన్ని మించినోళ్ళు లేరు కదా ? మర్యాదగా బతికే వూర్లో బోగం కొంప బెట్టించినాడు, సిగ్గులేనోడు !"

కొత్తపిల్ల ప్రయోగించిన కనికట్టు మహాత్యంకాబోలు, పంపుసెట్టు దగ్గరికి కాశీపతి ఎప్పుడొచ్చి నిలబడిందీ వెంకటేశు గమనించనేలేదు. కాశీ సిల్కులుంగీ కట్టుకున్నాడు. కశ్మీరు గొర్రెను భుజాల మీది కెక్కించుకున్నట్టు, గుండీలు



ఉప్పులేని కూడు

వూడదీసిన చొక్కామీద టర్కీటవల్ వేలాడదీసుకున్నాడు, కొత్తపిల్లను చిదిమి బుగ్గన పెట్టుకున్నట్లు, టూత్‌బ్రష్ దవడ సందులో ఇరికించుకున్నాడు.

కాశీపతి లింగన్నగారి ముద్దులకొడుకు. పట్నంలో చదువుకుంటున్నాడు. సెలవుల్లో ఇంటికొచ్చాడు. వారంరోజుల నుంచీ క్రమం తప్పకుండా ఉదయవేళల్లో పంపుసెట్టు దగ్గరికి హాజరవుతున్నాడు. నూనూగుమీసాల నూత్న యౌవనాన్ని కవ్వించే ప్రయత్నంలో ఒళ్లంతా మెలికలు తిప్పుకుంటోన్న తిలోత్తమ తొందరితనాన్ని చూడలేక, చెరకుదోట చుట్టూ తిరిగివచ్చాడు వెంకటేశు. అప్పటికి ఆ ఆడవాళ్లు అక్కడలేరు. పిండుకున్న చీరను భుజానవేసుకుని, తిలోత్తమ గుడిసెవైపు నడుస్తోంది. నీళ్లలో యింకా అడుగైనా పెట్టని కాశీ చొక్కా తడిసిపోయి వుంది. ఎవరో వీళ్లు చిమ్మకపోతే చొక్కా ఎలా తడుస్తుంది ? ... శృతి కలిసిందన్నమాట !

ఆ రాత్రే కాశీ డ్యూయెట్ సాంగ్ పూర్తి చెయ్యటం వెంకటేశు కళ్లబడింది. వేసవిరేయి చల్లగావున్నా, నడిజాముదాకా నిద్రపట్టక, పంపుషెడ్డు పక్కన నులకమంచం వాల్చుకుని కూర్చున్న వెంకటేశు — బహుళ చతుర్దశి నాటి చిమ్మచీకటిలో సుందరమ్మ గుడిసెలో దూరబడుతున్న కాశీపతిని పోల్చుకునేశాడు. అరగంట తరవాత గుడిసెలో నుంచి బయటపడి, తొందర తొందరగా రోడ్డువెంట వెళ్లిపోతున్న కాశీపతి — ఎదురుగా వస్తున్న లారీ హెడ్‌లైట్ల ఫోకస్‌లో స్పష్టంగా కనిపించాడు.

సానికొంపలోకి ఎవరైనా రావచ్చు, ఎవరైనా పోవచ్చుగానీ, కాశీపతి వచ్చివెళ్లడం మాత్రం విచిత్రమే ! తాను తీసిన గోతిలో తానే పడటమంటే, యిదే కదా ? కాశీ వేశ్యల కౌగిళ్లలో విశ్రమించి వెళ్ళాడన్న వాస్తవం లోకానికి తెలియకపోతే నష్టమేమీ లేదు కానీ, ఆ కొడుకును కన్న తండ్రికి తెలియకుండా మాత్రం అది మరుగైపోరాదు. అణ్వస్త్రాలవల్ల ఉత్పత్తిల్లే దుష్ఫలితాలను గురించి మొదట తెలుసుకోవలసిన వాడు, వాటిని తయారుచేసి అమ్మకానికి పెడుతున్న అగ్రరాజ్యంవాడే కదా ?

మరునాటి ఉదయం వారాంగనల జలక్రీడలు ముగిసిన తరవాత కాసేపటికి పంపు ఆపాడు వెంకటేశు. పొలం గట్లమీదుగా నడుస్తూ, బావి దగ్గరకు వచ్చాడు లింగన్న చెరకుతోటవైపు, అరటితోటవైపు, మిరపతోటవైపూ చూశాడు. తల పైకెత్తి, బావిగట్టున వున్న కొబ్బరిచెట్లలోని కాయల వైపు చూశాడు. "ఒరే ఎంకిటేగా ! ఈ దినం ఒక్క పొద్దులంట్రా ! సుబ్బులుకు రెండు అరిటాకులూ, రెండు టెంకాయలూ కావాలంట !"అన్నాడు.

అతడు వచ్చింది, సానికొంపకు అద్దె వసూలు చేసుకోటానికేనని వెంకటేశుకు తెలుసు కాశీపతి వ్యవహారాన్ని బయటపెట గానే అతడి ముఖం ఎలా మారుతుందోనని ఊహించుకుంటూ. వెంకటేశు కొబ్బరి చెట్టెక్కి, రెండు కాయల్ని తుంచి కింద పడేశాడు కిందికి దిగివచ్చి, అరటితోటలో మంచి ఆకులు రెండు కోసుకొచ్చాడు.

"ఆ సుందరమ్మను పిలవరా !" అన్నాడు లింగన్న.

వెంకటేశు గుడిసెవైపు ముఖంతిప్పి, "సుందరమ్మా !" అని కేకేసి, తగ్గుగొంతుకతో యిలా అన్నాడు : "అన్నా ! నీ కొక రహస్యం చెప్తా, చెప్పకపోతే ఎట మరి ? అబ్బ రాత్రి సుందరమ్మ గుడిసెకొచ్చి అరగంటసేపుండిపోయినాడు. కొత్తగా కుర్ర ముండొకటొచ్చిందిలే ! నేను జెప్పినానని అబ్బతో చెప్పొద్దు !"

వెంకటేశు లింగన్న ముఖంవైపు పరీక్షగా చూశాడు. అర్థంకాని లిపిలా వుంది ఆ ముఖం.

సుందరమ్మ బావి వైపుగా వస్తూ వుండటం చూసిన లింగన్న కోపాన్ని గొంతులో అదిమిపట్టుకుంటూ, "ఒరే ! అరిటాకులూ, టెంకాయలూ యింట్లో యిచ్చిరాపో !" అన్నాడు. వెంకటేశు వాటిని అందుకుని అడుగడుక్కీ వెనక్కితిరిగి చూస్తూ ఇంటి దారి పట్టాడు.

ఇల్లు చేరగానే అతడి కళ్లు కాశీపతికోసం చుట్టూ వెతికాయి కాశీ కనిపించలేదు. వెంకటేశు చురకత్తి తీసుకుని కొబ్బరికాయల పీచు ఒలుస్తూ, "అబ్బ ఏడమ్మా ? లేడా ఇంట్లో ?" అని లింగన్న భార్య సుబ్బులమ్మను అడిగాడు.

"అడ, గురకబెడతా వుండేది ఎవరనుకుంటివి ? వాడే ! ఇంకా మంచం దిగలా !"

పీచు తియ్యటం పూర్తిచేసి, గొడ్లపాకలో చూరుకింద పెట్టిన సత్తుగిన్నె కడిగి తెచ్చుకుని, అందులో చద్ది పోయించుకుని కలుపుతూ సావిట్లో కూర్చున్నాడు వెంకటేశు.

అంతలో, జేబులో చెయ్యివేసుకుని లింగన్న యింటికి తిరిగొచ్చాడు. అతడి ముఖంలోని గంభీర ముద్రను చూసి, ఆ ఇంట్లో ఆ పూట భూమి బద్దలు కావడం తథ్యమనుకున్నాడు వెంకటేశు.

లింగన్న మౌనంగా నడవలోకి వెళ్లాడు. లోపలి గదిలోకి తొంగిచూసి ఒక్కసారి



బుసకొట్టాడు. "ఇంకా నిద్ర లేవలేదన్న మాట" అని దాని అర్థం. జేబులోని చేతిని పైకి తీశాడు. ఒక చేతిలో పదిరూపాయల కాగితం, మరో చేతిలో ఐదురూపాయల కాగితం పట్టుకుని వాలుకుర్చీలో చేరగిల బడ్డాడు.

"ఒసే! నీ కొడుకు జేసిన నిర్వాకం చెప్పమంటావా?"

"ఏం జేసినాడో?"

"రాత్రి వీడు ఆ భోగమోళ్ళ గుడిసెలో దూరి పరీక్ష రాసొచ్చినాడు. అందుకుగాను సుందరమ్మ కిచ్చిన రిజిస్ట్రేషన్ ఫీజు, ఇదో, ఈ పదిరూపాయలు! సరే, వొచ్చేటప్పుడు వూరికే రానొచ్చు గదా? ఉహుఁ! క్లాసు రావాలగదా! ఆ కుర్రముండకిచ్చిన ట్యూషన్ ఫీజు, యిదో, ఈ అయిదు రూపాయలు!"

"అందుకేనా ఆ మొద్దు నిద్దర!" అంటూ బుగ్గలు నొక్కుకుంది సుబ్బులమ్మ.

ఉప్పులేని కూడు

"ఒసేయ్ సుబ్బులూ! మేనేజిమెంటు చేతికొచ్చి కొంప గుండం జేసుకోకముందే, నీ కొడుక్కు కొంచెం బుద్ధిమతులు చెప్పు! మనిషికి పెద్దరికం అంటగట్టేది దుడ్లేనే! కాలేజీలో నేర్చుకునేదిగాదు సదువంటే! తెలివైనోడు డబ్బు సంపాయిస్తాడు గానీ, కర్చుబెట్టడు. అదీ సదువంటే!.. అది కాదే, ఏదన్నా కావాలంటే దుడ్డు పారెయ్యాలనేదే రూలా? నేను జూడు, వూరికి సర్పంచినా? రోడ్డు మీద అంగళ్ళుండాయిగదా, నడుంమింద చెయ్యి ఆనించుకుని పండ్లంగడి ముందర నడిరోడ్డులో నిలబడి 'పండ్లు మంచివేనా?' అంటాను. పండ్ల కుప్పుసామి హైక్లాస్ అరటిపండ్లొక డజనూ, ఒంటిచేత్తో పట్టుకుంటే జారిపడిపోయే ఆపిల్ పండ్లు రెండు కాయితంలో చుట్టి మర్యాదగా చేతికిస్తాడు. నన్ను వాడు దుడ్లడిగిందీలేదు, నేను వాడికిచ్చిందీలేదు నేను సర్పంచిని గదా? నాతో మంచిగా ఉండకపోతే వాడి అంగడి వుండదు. ఇట్టాంటివి చెప్పాలంటే, వెయ్యి చెప్పొచ్చు! ఆ సుందరమ్మకు ఆధారం చూపించింది నేను గదా. ఈ మొద్దావతారం దుడ్డియ్యకపోతే అదేమన్నా వీణ్ణి మెడబట్టి తోసేస్తుందా? ఫూల్!"

పశ్చాత్తాపంతో మాడిపోతాడనుకున్న లింగన్న ఇలా అంటుంటే, వెంకటేశు రక్తం కుతకుత లాడిపోయింది. మొదటి ముద్ద గొంతు దిగకముందే, తెరుచుకున్న నోరు తెరుచుకున్నట్లే వుండిపోయింది. "సిగ్గులేనోడు సిగ్గులేనోడు!" అనుకుంటూ నోటిలోని కూటిని కసికొద్దీ తుపుక్కున వుమ్మేశాడు వెంకటేశు.

"ఏందిరా ఎంకటూ? ఏమయింది?" అంది సుబ్బులమ్మ.

"ఉప్పేసుకోలేదమ్మా!" రకీమని జవాబిచ్చాడు వెంకటేశు. ★

ఆంధ్రపత్రిక

మదరాసు నగరంలో "ఆంధ్ర పత్రిక", "ఆంధ్ర సచిత్ర వారపత్రిక", "భారతి" (మాసపత్రిక)లు కావలసినవారు ఈ క్రింది చిరునామావారితో సంప్రదించండి :

శ్రీ పి. ఆదిమూలం

64, గౌడియుయిట్ రోడ్డు, రాయపేట, మదరాసు - 600014.

ఫోను నం. 848780

లేక

ఆంధ్రపత్రిక

156, తంబుచెట్టి వీధి, ఆంధ్ర ఇన్సూరెన్సు బిల్డింగ్సు, మదరాసు - 600 001.

ఫోను నెం. 21747.